పడకకుర్చీలో కూర్చుని లంక పొగాకు పాయలుగా చీల్చి చుట్ట చుట్టుకుంటూ జీతగాళ్ళు చెప్పేమాటలు వింటున్నారు లింగమూర్తిగారు. ఏభై ఎకరాల మాగాణి ఒక్క చేతిమీదుగా చూసుకుంటాడాయన. చుట్టచుట్టడం పూర్తిచేసి, మొన కొద్దిగా కొరికి "నాంచారీ నిప్పు పట్టుకురా" అని అరిచారు.

చుట్ట ముట్టించి రెండు గుక్కలు లాగాకగాని ఆయనికి వింటున్న మాటలు మనస్సుకి ఎక్కవు. ఈ విషయం బాగా ఎరిగిన పెద్దపాలేళ్ళు కర్రల్ని బుజాలకి పోటీపెట్టి నిలబడి ఉన్నారు. కూలివాళ్ళు మాత్రం ఏదో చెబుతున్నారు — ఆయన వింటు న్నాడన్న అపోహతో.

"ఆ, సుబ్బడూ— ఏం చేశార్రా ఇవాళ ?" అన్నా రాయన చివరికి.

"నిగావహాను" సుబ్బయ్య కొంచెం ముందు కొచ్చి అవాళ్టి పనులన్నిటిని సమీక్షించ సాగాడు —

"మెరకచేనుకి నీరు సరిగా ఎక్కటంలేదు. అందుకని పంపు ఆడారు గంగులు, పాపడు. ఈనాంకి ఇవ్వాళల్లా నీరు ఎక్కిందికాని నీళ్ళు జాలుగా వస్తుం డటంవలన ఆ ఎక్కింది చాలదు రేపుకూడా నీరు పట్టాలి...." ఏ ఏ చేలకి నీళ్ళు వెళ్ళిందీ వెళ్ళవల సిందీ — పంపు వేసినది, వేయవలసినది వగైరా చెబుతూంటే ఆట్టే వింటున్నారు లింగమూర్తి గారు.

ఇలా రోజూ ఒక గంట సేపు ఉంటుంది ఈ కార్యక్రమం. చివరికి కూలీలకి బట్వాడాచేయవల సిన డబ్బు లెక్కవేసి పెద్దపాలేరు సుబ్బయ్యకిచ్చి మర్నాడు చేయవలసిన పనులుకూడా చెప్పేశారు. ఇక ఎక్కడివాళ్ళక్కడ వెడుతున్నారు.

మిత్రులందరిని బయట నిలబెట్టి వాసు ఒక్కడే లోపలికి వచ్చేప్పటికి అంతా బయటికి వెడుతూ ఎదురయ్యారు.

"సరిగా సమయానికే వచ్చాను" అనుకున్నాడు వాసు. లింగమూర్తిగారి చూపుకి త్వరగా కనబడే ట్టుగా నిలబడ్డాడు.

అందరినీ "ఇక వెళ్ళండి" అని చెప్పిన ఆయన కంటికి వాసు కనబడ్డాడు. వెంటనే —

"సుబ్బయ్యా, ఒక్కనాటు ఆగు — వాళ్ళని కూడా పిలవరా నాంచారీ !....చూడు సుబ్బయ్యా, పైఏడు మన పాటిదిబ్బమీద మెరపనారు వేయాల నుంది. పండుతుందంటావు ?" అనడిగారు.

వెళ్ళిపొమ్మన్న మనిషి పని వేళా వెనక్కిపిలిచి 'పైఏటి' విషయం మాట్లాడతాడేమో అని ఒక్క క్షణం విస్తుపోయి చుట్టు పరికించిచూశాడు సుబ్బయ్య. వాసు కనబడగానే సంగతి గ్రహించి తాపీగా అరుగుమీద కూర్చుని—మెరపనారు ఎలా వేయవలసిందీ, నీరు ఎలా పెట్టవలసిందీ — తమ పాటిదిబ్బ మిరపనారుకి ఎంత శ్రేష్ఠమయినదీ—వగైరా ఏకరువు పెడుతుంటే లింగమూర్తిగారు ఏకధ్యానగా వింటున్నారు.

వాళ్ళ ఈ ప్రవర్తన వాసుకి కష్టం కలిగించింది. కేవలం తననిచూసి — తనతో మాట్లాడటం ఇష్టం లేక వాళ్ళని వెనక్కిపిలిచిన మేనమామ పద్ధతి అతనికేమీ నచ్చలేదు. అయినా వ్యవహారంపట్ల కోపం రాకూడదని తెలిసి అలాగే నిలబడ్డాడు.

**ప్రపంచం పురోగమించిందో లేదో తెలియదు. కాని మానవుడు మాత్రం నాటికి నేటికి ఒక్కలాగానే ఉన్నాడు. గ్రామంలో ఎన్నో మార్పులు వచ్చినా, రాబోతున్నా పట్టించుకోక, ఒక ముఖ్యమైన సందర్భంలో ఎదిర్చి నిలిచిన లింగమూర్తి.. కన్నకూతురు ప్రాణానికే ముప్పం రావడంతో ఆ మార్పునే కోరి వరించాడు...**

అప్పుడే లోపలికొచ్చిన నాయుడు "ఏం వాసు బాబూ, పనిమీద వచ్చినట్టున్నావు ?" అన్నాడు — వచ్చాడని లింగమూర్తిగారికి తెలియబర్చాలని.

"ఆ, మావయ్యతో కొంచెం పనుండి — ఆ మాటకొస్తే మీ అందరితోనూ పనుందనుకోండి" అన్నాడు వాసు నవ్వుతూ.

ఇక అతని ఉనికిని గుర్తించక తప్పని పరిస్థితి ఏర్పడింది ఆయనకి —

"ఏమోటోయ్ వాసూ, ఎంత సేపయింది వచ్చి— నిలబడిపోయావ్ ?" అన్నారాయన కూర్చోమన్న ధ్వని కలగజేస్తూ.

"మన ఊరివిషయం మాట్లాడదామని...."

"ప్రెసిడెంట్‌గారికి మాతో ఏం పనో ?" అన్నా డాయన హేళనగా నవ్వుతూ.

"అదేమిటి మావయ్యా — ప్రెసిడెంటుగా తప్ప ఇంకొకరకంగా నీకంటికి కనబడనా ?" అన్నాడు కష్టంగా వాసు.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. చివరికి వాసే మొదలెట్టాడు —

"మన ఊరు పెద్ద రోడ్డుకి రెండు మైళ్ళ దూరంలో ఉంది. మన ఊరిమీదుగా చాలా వూళ్ళు న్నాయి. కాని మనం పూనుకోందే వాళ్ళసలు కదిలిరారు. రోడ్డుకయ్యే మొత్తం ఖర్చు ఒక్క ప్రజలే భరిం చాలంటే అది జరిగేపని కాదు. కనుకనే ఇన్నేళ్ళుగా ఎవరూ ఆ ప్రయత్నం కూడా చేయలేదనుకుంటా ! ఇకపోతే రోడ్డులేకపోవటంవలన మన బళ్ళు, ఎడ్లు పడుతున్న బాధ మనం అంతా ఎరుగున్నదే. మంచి రోడ్డుమీద పది, పన్నెండు బస్తాలు తేలిగ్గాలాగే బళ్ళమీదకూడా మనం ఏడు, ఎనిమిది వేసేందుకు భయపడుతున్నాం. అదికూడా ప్రాణాలు బిగ పట్టుకుని రోడ్డు ఎక్కేదాకా నానాయాతనా పడు తున్నారు. లారీవాళ్ళని రమ్మంటే వాళ్ళు రావ లేదు. అథవా వచ్చినా మట్టిలో కూరుకుపోయి వస్తే తిడుతున్నారు.

"ఇన్ని రోజులుగా ఇదంతా భరించాం — గత్యం తరంలేక. ఇప్పుడు గవర్నమెంటు 'బ్లాకు'లుపెట్టి పల్లెలకి ఇతోధికంగా సాయంచేసి వాటి సౌకర్యాల కోసం కృషి చేస్తోంది. ఒక రోడ్డు వేయాలంటే అయే మొత్తం ఖర్చులో సగం వాళ్ళు ఇస్తారు. మిగిలిన సగం మొత్తాన్ని ప్రజలు, పంచాయతీ చెరి సగం భరించాలి. అయినా మీలాంటివాళ్ళకి నే నివ్వన్నీ చెప్పనవసరంలేదు — మీకూ తెలుసు కాబట్టి.

"మన పంచాయతీ తరఫున బ్లాకువాళ్ళని సంప్ర దించాను. మొత్తం అరవయి వేలు అవుతే అందులో పంచాయతీ, మనం కలిసి ముప్ఫయివేలు భరిస్తే శాంక్షన్ అవుతుందని చెప్పారు.

"అందువలన, మా మావయ్యలాంటివాళ్ళు దానికి పూనుకుంటే నిండుదనం వస్తుంది ఈ కార్యానికి. ఎక రానికి పదిరూపాయలు వసూలుచేశామంటే చాలు" అంటూ పూర్తి చేశాడు వాసు.

లింగమూర్తిగారు ఏమీ మాట్లాడకుండా తన చుట్టపొగలో తన్మయత్వంచెందుతున్నాడు —

"ఏమంటారు కరణంగారూ ?" అని హెచ్చ రించాడు నాయుడు — ఆయన ఏమీ అనకపోతే ఆ బాధ్యత తనమీదికి వస్తుందన్న భయంతో !

"అనేందు కేముంది నాయుడమ్మా ! మనం ఏపాటివాళ్ళం కోన్‌కిస్కాగాళ్ళం. గుడ్డికన్నుమూస్తే ఎంత, తెరుస్తే ఎంత?"

"నువ్వలా అనుకున్నా మేమనుకోవడంలేదు మావయ్యా—కరణానివి. ఏభయి ఎకరాల ఆసామివి.— 'కోన్‌కిస్కా' ఎలా అవుతావు ?" అన్నాడు నవ్వుతూ వాసు.

కూర్చున్న కూలీవాళ్ళు, పాలేళ్ళు గలగల నవ్వారు.

లింగమూర్తిగారికి ఒళ్ళు మండిపోయింది. "ఏవి టిరా ఆ ఇకఇకలు—ఊళ్ళో జరిగే పనులన్నిటికి మనతో సంప్రదిస్తున్నారా ? ఇదివరలో మనం కాద న్నవి ఆపేశారా ? గుండెమీద చేయివేసుకొని చెప్ప మను ఏ మగాడినయినా ! ఈనాడు చందాలు కావలసి వచ్చేప్పటికి ఈ లింగమూర్తి కనబడ్డాడా ! రోడ్డు లేకుండా ఊరు ఇన్ని ఏళ్ళు బతకలా ? ఇప్పుడు వెయ్యకపోతే బతకదా —ఏం నాయుడూ !"

"నీమాటకి ఢోకా ఉందా బావయ్యా" అన్నాడు నాయుడమ్మ వోరగా వాసుకేసిచూస్తూ.

ఈ పరిణామం వాసుస్నేహితులు వూహించి చెప్పినా వాసుమట్టుకు మావయ్య ఇంత పట్టుదల మనిషి అనుకోలేదు. దాళవా—వరి రెండవపంట— ఆయన వద్దన్నా కూలీజనం చిన్నరైతులు బాగు పడతారన్న ఆశతో తెప్పించావన్న కోపం ఇంకా పోలే దన్నమాట అతను పసిగట్టలేకపోయాడు.

"బ్రతకలేమనికాదు మావయ్యా, నిక్షేపంగా బతక గలం. కాని మన ఎడ్లు ఎంత కష్టపడుతున్నాయో చూడు. రేపు రోడ్డు పడితే పెద్దరోడ్డునుండి మన వూరుకు ఒక వాన్ వేయించుకోవచ్చు—ప్రయాణా లకి వీలుగా ఉంటుంది. అద్దద్దా అంటే వైద్యా




సింగరాజు రామచంద్ర మూర్తి

నికి వాటికి వీలుగా వుంటుంది. మొన్నటికి మొన్న రత్తయ్యకోడలు చచ్చిపోయిందంటే కారణం—వైద్యంలేకపోవడమే. బండిలోవేసి బస్తీ వెళ్లేందుకు నాలుగ్గంటలు పట్టింది. తీరా వెడితే డాక్టర్లు లోపల పిండం కుళ్ళిపోయింది — వెంటనే తీసుకొస్తే బావుండేది అన్నారుట !"

"ఇవన్నీ నాకు తెలియవబ్బాయి — నేను మొండివాడిననుకో. ఈ 'అభ్యుదయ' గ్రామంలో ఉండదగినవాడిని కాననుకో. అభివృద్ధి నిరోధకుడిననుకో— నీ ఇష్టం. నేను లేకుండానే అన్ని పనులు చేయించుకోగల సమర్థులు ప్రెసిడెంటులు, మునసబులు—ఇది కూడా చేయించండి చూదాం! పద నాయుడమ్మా !" అంటూ కండువా భుజాన వేసుకుని కర్ర పుచ్చుకుని గుడిదగ్గరకు బయలుదేరారు లింగమూర్తిగారు. నాయుడు వగైరాలు అనుసరించారు.

"మాబాగా చెప్పారులెండి కరణంగారు. అసలు తను కొత్తగా కొన్న మోటారుసైకిలు ఈ రోడ్డుమీద పాడయిపోతోందని ఎత్తాడు ఈ ఎత్తు !" అన్నాడు నాయుడు దారిలో అగ్గిపుల్ల వెలిగించి గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ ముట్టించుకుంటూ.

"సరే — బుర్‌మని స్నేహితుల్ని వేసుకుని సినిమాలకి ఆయన వెళ్లేందుకు మనంచందాలెందుకు ఇవ్వాలి ?"

నీరయిపోయాడు వాసు. వ్యక్తులమధ్య పొరపొచ్చాలు ఉండచ్చుగాని, వాటిని సాధించేందుకు ఊరు బాగుపడకుండా చేయడం ఏం భావ్యం ?

ఉసూరుమంటూ బయటికొచ్చాడు వాసు.

"ఏరా — కాయేగా !" అడిగారు బయట ఆత్రంగా ఫలితంకోసం ఎదురుచూస్తున్న మిత్రబృందం.

"వాడి ముఖంచూస్తే తెలియటంలా ! కాయ కాదు పిందె — పువ్వు....అయినా వాడి పిచ్చగాని నేను ముందే చెప్పలా ! ఆయన కలిసిరాడురా అబ్బీ అంటే వింటేనా ? "మామయ్య అంత మూర్ఖుడు కాదురా" అంటూ పోయాడు.

"ఏం చేద్దాంరా ఇప్పుడు వాసూ ?" అడిగాడు శేషగిరి.

"చేసేందుకేముంది ? వీళ్ళ మావయ్యకి ఏభయి ఎకరాలు ఉంది. అంటే ఎకరానికి పది చొప్పున అయిదు వందలు ఇవ్వాలన్నమాట ఆయన. ఆ డబ్బు కూడా ఊరిమీదే వసూలు చేద్దాం. ఆయనికి సిగ్గు వస్తుంది అప్పుడు" అన్నాడు వెంకటరావు కొంచెం ఆవేశంగా.

వాసు పేలవంగా నవ్వాడు —"ఒరేయ్ — ఉన్నవాడు కరణం. ఆయనే ఇవ్వకపోతే మనకింక వూళ్లో ఏం పుడుతుందిరా ? "కరణంగారే ఇవ్వకపోతే మేమెలా ఇస్తాం" అంటారు ఎవరికి వారు. "మనం కష్టపడి వేయిస్తే ఆయన అనుభవించేందుకా వీళ్ళేదు" అంటారు మరికొందరు. అందువలన ఇటువంటి పనులకి అందరి అండ, సపోర్టు ఉండాలి. ముఖ్యంగా ఉన్నవాళ్ళు ఒప్పుకోవాలి. అందులోనూ ఆయన కరణం !"

"అయితే ఇప్పుడేమంటావు ?"

"కాసేపు నన్ను వంటరిగా వదిలేయండి. భోజనాలయాక మాట్లాడుకుందాం" అని వాళ్ళనందరినీ వదిలించుకుని చెరువుకేసి బయలుదేరాడు.

# ప్రగతిపథం

వెన్నెల పిండి ఆరపోసినట్లుంది. సన్నటి పైర్గాలికి ఈనబోతున్న వరి మొక్కలు బరువుగా, నిండు గర్భిణులలాగా తలలాడిస్తున్నాయి. చెరువులో చిన్న చిన్న అలలులేచి వెండి కరిగించి పోసినట్టు తళతళలాడుతోంది.

రేవుకి పక్కగా రాయిమీద కూర్చున్నాడు వాసు. అతని మనస్సంతా వికలం అయిపోయింది.

తాను అనుకున్నదానికి ఇప్పుడు జరుగుతున్న దానికి మధ్యనున్న దూరం అతన్ని బాధిస్తోంది.

పుట్టి పెరిగింది పల్లెటూరిలోనే కాబట్టి అతనికి పల్లెలంటే చాలా ప్రేమ. పల్లెటూరివాళ్ళు చాలా అమాయకులని, కల్ల కపటం లేనివాళ్ళని— బస్తీల కుళ్ళు, కృత్రిమం ఇంకా పల్లెలకి రాలేదని అతని అభిప్రాయంగా ఉండేది. చదువుకోసం

> వైద్య విద్యార్థి—"మీ దుకాణంలో ఉన్న "ఎనాటమీ" పుస్తకాలు దశాబ్దాల క్రిందట వ్రాసినవి. కొత్తవి ఎందుకు తెప్పించరూ?"
>
> దుకాణం యజమాని—"ఈ అన్ని దశాబ్దాలలోనూ మానవుని అస్థిపంజరంలో కొత్తఎముకలు ఏమైనా వచ్చిచేరాయా?"
>
> రియాజ్ పాషా (కాకినాడ)

బస్తీలో బంధువుల ఇంట్లో ఉండేప్పుడు ఎప్పుడు శలవలొస్తాయా అని ఎదురుచూసేవాడు. స్కూల్ ఫైనలులో చదివిన హోవ్స్ కమింగులో పధిక్ చక్రవర్తి పోలికలు తన కున్నాయనిపిస్తుండేది.

పల్లెజీవితం, బస్తీజీవితం — డిబేట్లల్లో పల్లెల వైపు మాట్లాడి బహుమతులుపొందేవాడు. కాలేజి రోజుల్లో పల్లెపట్టు ప్రతిబింబించేట్టు కథలు రాసేవాడు. ఇవన్నీ అతను హృదయపూర్వకంగానే చేశాడు. కారణం— వాటిని తను మనసారా నమ్మడం.

వాళ్ళనాన్నకి ఒక నలభయి ఎకరాలదాకా మాగాణి, ఒక మావిడితోట ఉన్నాయి. సంతానం—మగపిల్లాడు తానొక్కడే. అందుకనే ఉద్యోగంమీదికి మనను పోనీయకుండా వ్యవసాయపు బి.ఎస్‌సి. పాసయి స్వగ్రామం చేరుకున్నాడు—తన ఆశయాలని అమలు పర్చుకోవాలని, చదివిన చదువును సార్థకం పరుచుకోవాలని.

ఇంత చదువు చదివింది పొలం దున్నేందుకా అన్న మిత్రుల హేళన లక్ష్యపెట్టలే దతను. మొదట్లో అతని కంటికి ఊరంతా ఒక్కమాట మీదున్నట్టు కనిపించింది. కాని చీకటికి అలవాటు పడినవాడి కంటికి వస్తువులు వివరంగా కనబడినట్టు క్రమేణా ఊళ్లోని పార్టీలు, పట్టుదలలూ, కక్షలు అన్నీ అవగతమవసాగాయి. ఇదంతా తన భ్రమేమో అనుకుని సరిపెట్టుకో చూశాడు. కాని అది అతని శక్తికిమించిన పనయింది. తను పదిలంగా పెంచుకున్న అభిప్రాయాలు తనకళ్ళముందే దూదిపింజల్లా చెదిరిపోవడం బాధించింది అతన్ని.

కరణంగారి బావి వేరు. మునసబుగారి బావి వేరు. వారిపార్టీవా రిందులో, వీరిపార్టీవా రందులో నీళ్ళు ముట్టరు. తటస్థంగా ఉందామంటే ఆ వ్యక్తి మనుగడే పెద్దప్రశ్న.

ఇటువంటి పరిస్థితుల్లో పులిమీద పుట్రలాగా రెండవపంట సమస్య ఒకటి ఉత్పన్న మయింది క్రితం సంవత్సరం. మునసబు కావాలన్నాడు కాబట్టి లింగమూర్తిగారు వద్దన్నారు. అంతా కలిసి కలెక్టరు దగ్గరకు పోయారు. దీనివలన కూలీ చేసుకునే వాళ్ళకి, చిన్న చిన్న రైతులకు లాభం ఉందని గ్రహించిన వాసు తన మిత్రులతోసహా రెండవ పంట కావాలని బలపరచాడు.

వాసువాళ్ళ అండతో రెండవపంట సాధించాడు మునసబు. బీదవాళ్ళంతా సంతోషించారు. పంట బాగా పండటంతో రైతులుకూడా ఆనందపడ్డారు. ఇదంతా లింగమూర్తిగారికి కోప కారణమయింది. వాసుని మునసబుపార్టీవా డయిపోయాడని మండిపడ్డాడు. కేవలం తన్ని అవమానపరిచేందుకే ఈ ఎత్తు ఎత్తిన మునసబు విజయానికి కారణం వాసు అవడంవల్లనే ఆయనకోపం మునసబుమీంచి వాసు వైపుకు మళ్ళింది.

పెరిగిన పలుకుబడివలన వాసు పంచాయతీబోర్డు ప్రెసిడెంట్ అయ్యాడు. ఇది అతనికి ఇష్టంలేకపోయినా, "వూరు బాగుపడాలంటే నువ్వే ఉండాలి" అని అంతా అనడంతో ఒప్పుకున్నాడు.

తన కుడిభుజం నాయుడమ్మని ప్రెసిడెంటుని చేద్దామనుకున్న లింగమూర్తికి ఇది ఇంకో పెద్ద అఘాతం అయింది. అసలు ఇందుకోసమే వాసు మునసబుని సమర్థించాడని ఆయన నమ్మకం.

రాను రాను వాసు వాళ్ళ ఇల్లు లింగమూర్తిగారింటినుంచి ఎడమయింది. ఆయన కూతురుకు ఇతరత్రా సంబంధాలు చూడబోవడంతో ఇప్పట్లో కలిసే లక్షణాలు కూడా మృగ్యమయాయి.

ఒక ఏడాదిగా జరిగినవన్నీ వాసు మనఃఫలకంలో మెదిలాయి. ఆలోచనల్లోంచి తేరుకొని చేతివాచీ చూసుకున్నాడు. ఎనిమిదయింది. లేచి నిలబడ్డాడు.

రేవులో మెట్లమీద ఎవరో అమ్మాయి బిందె నీళ్ళతో నింపుకుని నడుంమీద పెట్టుకుని మెట్లెక్కి వస్తోంది ఎవరా అని ఒకక్షణం చూశాడు వాసు. సావిత్రి.

మనస్సు ఆనందంతో ఉరకతీసింది. మాట్లాడుదామని అడుగుముందుకువేయబోయాడు. కాని అంతలోనే ఇప్పటి తమ పరిస్థితి తలుచుకుని వెనకాడాడు. "సావిత్రిని ఇంకొకరికిచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు వాళ్ళ నాన్న. ఆమె ఇక తనదికాదు" దిగులుగా అనుకుని అడుగేయబోయాడు.

"బావా !"

వీణ మీటినట్లు వినబడిన పిలుపు కాళ్ళకి బంధం వేసింది అయినా తనని కాదన్నట్లు ముందుకు సాగాడు

"బావోయ్! నిన్నే — పెద్దవాళ్ళమీద కోప మయితే నేనేం అపరాధం చేశానో మధ్య" ఆఖరి మాటలు వణికాయి

గబుక్కున ఆగి వెనక్కితిరిగి ఆమెకు దగ్గరపో వెళ్ళాడు. కండ్లలో చంద్రుడు ధళధళలాడు తున్నాడు!

పశ్చాత్తాప పడ్డాడు తన మోటుతనానికి వాసు .. "క్షమించు సావిత్రీ, మనసు బాగోలేక —"

"సాయంత్రం మీ సంభాషణఅంతా విన్నాను బావా! నాన్న మూర్ఖత్వానికి నాకు బాధ కలిగింది" అని కాసేపాగి "నా కోసమయినా మా నాన్నతో కక పెట్టుకోకు బావా!" అంది దీనంగా

కరిగిపోయాడు వాసు.

"అసలు కక్షలుతేవు సావిత్రి! నేనెప్పుడు ఆయన మేనల్లుడినే ఆయన ఒప్పుకుంటే అల్లుణ్ణీ" అంటూ నవ్వాడు వాసు.

సావిత్రి కూడా నవ్వేసి పైట చెరుగుతో కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయింది.

రోజులు గడిచిపోతున్నాయి వాసుని స్నేహితులు ఏదో నిర యించమని తొందర చేసినా అతనుమట్టుకు ఆయనలో పరివర్తన రావాలని దానికి కాలం తప్ప శరణ్యంలేదని ఆగిపోయాడు

కోతలయిపోయి కుప్పలుకొట్టిస్తున్నారు రైతులు. పొలాలమీద లక్షల రూపాయలు విలువచేసే పంట పరుచుకునుంది పల్లెపట్ల లక్ష్మీ తాండవమాడు తోంది ప్రొద్దుక్రుంకేప్పటికే సంక్రాంతి చలి గడ గడ లాడిస్తోంది.

కూలీలందరినీ ఇళ్ళకు పంపేసి ధాన్యపురాసి దగ్గర కాపలా కూర్చున్నాడు వాసు. చీకటి దట్టంగా అలుముకుంటోంది దూరంగా ఊళ్ళో, ఎలక్ట్రిక్ దీపాలు వెలిగాయి. వాటిని చూడగానే అతని కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి అవి సాధించేదుకు తన, తన మిత్రులు ఎంత కష్టపడిందీ, స్వంత డబ్బు ఎం, ఖర్చయిందీ అన్నీ అతని మనస్సులో మెదిలాయి. తం, చేతుల్లోంది దమ్మిడీ ఖర్చవలేదు కాబట్టి ఊరంతా సం తోషపడ్డారు

లింగమూర్తిగారి పార్టీమట్టుకు "మళ్లీసారి అసెం బ్లీకి నిలబడతాడు కాబోలు—ఎరవేశాడు ముందు" అన్నారుట

నవ్వుకున్నాడు వాసు అరచేతిలో శ్రీకారం చుట్టు కుని కళ్ళకద్దుకున్నాడు. ఇంతలో ఊరివైపునుంచి రొప్పుకుంటూ పరుగెత్తుకొచ్చాడు వెంకట్రావు

అతని వాలకంచూసి "ఏరా, ఏమయింది" అంటూ ఖంగారుగా అడిగాడు వాసు

"కొంపే మునిగిందిరా వాసు మీ సావిత్రిని తాచుపాము కరిచింది స్పృహతప్పిపోయింది"

రాయిలా స్తంభించిపోయాడు వాసు.

"పొద్దుకూకుమూటున పక్కింటివారమ్మాయి వసంతతో కలిసి చెరువుగట్టుకు వెళ్ళిందిట నీళ్ళ కోసం. చీకటిలో పాముమీద కాలేసేప్పటికి కాటే సింది వెంటనే దాన్ని చంపారు. నువ్వు త్వరగా ఇంటికి వెళ్ళు నేనుంటానిక్కడ" అని వాసుని ఒక్క కుదుపు కుదిపేదాకాని అత నీ ప్రపంచంలో పడలేదు.

కర్ర పుచ్చుకుని ఒక్క పరుగున వూళ్ళోకి వచ్చి పడ్డాడు. పది అంగల్లో లింగమూర్తిగారింటి గుమ్మం లోకివచ్చి లోపలిదృశ్యంచూసి అలాగే నిలబడిపోయాడు

అరుగుమీద పడుకోబెట్టారు సావిత్రిని. చలనం లేదు. కండ్లుమూసుకునున్నాయి నోట్లోంచిమట్టుకు కొద్దిగా నురుగు వస్తోంటే తుడుస్తున్నారు పోత పోసిన బంగారంలా ఉంది.

ఎవరో పాము మంత్రం తెలిసినాయన మంత్రం వేస్తున్నాడు అంతా ఆయన వంకనే చూస్తున్నారు లింగమూర్తిగారు నరికేసిన అరటిచెట్టులా గుడ్ల నీళ్ళు గుడ్లలోనే కక్కుకుంటూ గోడకి చేరగిల బడ్డాడు ఆపక్కనే వాసు తండ్రి, మునసబు ఉన్నారు.

సావిత్రి తల్లికి స్పృహ తెప్పించేదుకు ఉప చారాలు చేస్తోంది వాసు తల్లి.

"ఇప్పు డున్నవళంగా ఒక్క పావు గంటలో రైలు స్టేషనుకి తీసుకెడితే — అక్కడ రైలువాళ్ళు పాముల నరసయ్యగారికి ఫోనులో చెబుతారు. క్షణాలమీద నయ మవుతుంది" అంటున్నారు పూజారిగారు లింగమూర్తిగారితో ఇక్కడ మంత్రం వేస్తున్నాయన మంత్రబలం ఏపాటిదో తెలుసు పూజారికి!

లింగమూర్తిగారు గబుక్కునలేచి కూర్చుని "రాఘ వులూ! మన పెద్ద ఎడ్ల బండి కట్టండిరా" అంటూ అరిచాడు

ఇంతలో సుబ్బయ్య "కాని మన వెధవ రోడ్డు మీద ఎంత త్వరగాపోయినా గంటకి తక్కువపట్టదు బాబూ" అంటూ మెల్లగా అన్నాడు.

అతనివంకోకసారిచూసి నిస్పృహతో చేతుల్లో ముఖం కప్పేసుకున్నారు లింగమూర్తిగారు.

వాసు గిరుక్కునవెనక్కితిరిగి ఇంటికిపరుగెత్తాడు వాడుకలేకపోయినా సిద్ధంగా ఉంచుతాడు అతను మోటారు సైకిలును. దాన్ని బయటికిలాగి క్షణంలో లింగమూర్తిగారింటిముందు ఆపాడు.

రెండంగల్లో లోపలికివెళ్ళి ఎవ్వరివంకా చూడ కుండా సావిత్రిని ఎత్తి భుజాన వేసుకొని బయటికి తీసుకువచ్చాడు.

అదేమనలేదు ఎవరూ! బ్రతుకుజీవుడా అను కున్నాడు అక్కడి మంత్రాలాయన

చీకట్లోకి కాంతిని జిమ్ముకుంటూ దూసుకు పోయింది మోటారు సైకిలు

మనిషిలో పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడు అసాధ్యాన్ని సాధ్యం చేయగలదు. దానికి దైవబలం కూడా ఉంటే ఇంకా చెప్పనవసరంలేదు

ఆ ఇసకలో, గతుకుల్లో, చీకట్లో అతను ఎలా వెళ్ళాడన్నదానికి సైమాటే సమాధానం. పది నిము షాలకల్లా అసిస్టెంట్ స్టేషను మాస్టరు కంట్రోల్ ఫోనులో చెబుతున్నాడు "స్నేక్‌బైట్" అంటూ.

"నర్సయ్యగారు లేవమంటున్నారు లే"అని చెవులో అరచి మనిషి లేచిపోకుండా గట్టిగా పట్టుకోమన్నాడు. అలాగే అరిచాడు వాసు

కాసేపటికి కళ్ళు తెరిచి అంత బలంగలవాడిని వదిలించుకోవాలని పెనుగులాడసాగింది సావిత్రి. గట్టిగా వాటేసుకుని కూర్చున్నాడు వాసు

గంట సేపటికి మామూలు మనిషయిందికాని నీరసంగా ఉంది — కొంచెం ఆలస్యమయి ఉంటే



తలనొప్పా?

అమృతాంజనము
కొంచెం రాయండి

వెంటనే గుణం కనిపిస్తుంది
మీకు అమృతాంజనము ఎప్పుడు కావలసివస్తుం దో మీకే తెలియదు. ఇంట్లో ఎప్పుడూ ఒక బుడ్డిని ఉంచండి. ఎంతైనా నమ్మకమైనది.


అమృతాంజన్ లిమిటెడ్
14/15, లజ్ చర్చి రోడ్డు, మద్రాసు-4
బొంబాయి-2, కలకత్తా-1, న్యూఢిల్లీ
JWT-AMJ 1098

నారసింహ లేహ్యం


బంగారుతో చేరినది. మేహము రిక్కాత, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధికల్గించును. 200 కల్పి రు.3-8-0.పోస్టేజి రు. 1-1-0
పి సి ఎ అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెరిదేవి (PO) నెల్లూరుజిల్లా.

చెయ్యి దాటిపోయి ఉండేదని స్టేషను మాస్టరు అన డంతో వాసు ఒళ్ళు జలదరించింది.

మెల్లిగా సావిత్రిని లేవదీసి వాళ్ళందరికి కృతజ్ఞత తెలిపి మోటారు సైకిలుమీద వెనక కూర్చోబెట్టుకుని ఇంటికి బయలుదేరాడు. అతని ఆనందం వర్ణనాతీతం సావిత్రిని బతికించుకున్నాడు !

మెల్లిగా వస్తున్న అతనికి దారిలో అతనిమిత్రులు సైకెళ్ళమీద ఎదురయ్యారు. తనంటే వాళ్ళకున్న ప్రేమకి అతని హృదయం కృతజ్ఞతతో నిండి పోయింది అడుగడుగునా అడ్డంకులెదురయే రోజులలో తనకి చేయూతనిచ్చి, అండగా నిలిచారు వీళ్ళంతా. ఈ యువకులు లేకపోతే భవిష్యత్తుమీద ఆశ వదులుకుని ఏనాడో వూరు విడిచి పారిపోయేవాడు తను'' అనుకున్నాడు వాసు. అందరూ కలిసి రాత్రి పదింటికి లింగమూర్తిగారింటిముందు ఆగారు.

కన్నకూతురుని ఏఆకారంలో చూడవలసివస్తుందో నని హడలిపోతున్న లింగమూర్తిగారికి కనుపించిన దృశ్యం నేత్రపర్వంగా ఉంది.

వెనకసీటుమీద కూర్చుని రెండు చేతులతో వాసుని గట్టిగా పెనవేసుకుపోయి అతని వీపుమీద తలఆన్చి కూర్చుంది సావిత్రి.

ఆనందంతో ఇంటిల్లిపాదీ మనసారా మళ్ళీ ఏడ్చారు

# ప్రగతిపథం

మర్నాడు పొద్దున్నే పొలంనుంచి నేరుగా లింగమూర్తిగారింటికి వెళ్ళాడు వాసు. ఆయన ఇంట్లో లేడు.

''రావోయ్ అల్లుడూ'' అంటూ ఆహ్వానించి, వంటింట్లోకి వెళ్ళింది కాఫీకోసం సావిత్రితల్లి.

గదిలోకి వెళ్ళాడు.

నీరసంగా మంచంమీద పడుకున్న సావిత్రి అతన్ని చూడంగానే సిగ్గుతో ముఖాన్ని రెండు చేతులతో కప్పుకోబోయింది.

ఫక్కున నవ్వాడు వాసు —''ఎందుకో అంత సిగ్గు నన్ను చూడగానే. నిన్న నిన్ను ఎలా తీసుకు వెళ్ళానో తెలుసా — ఇలా ఎత్తుకుని'' అంటూ అమాంతంగా ఎత్తేశాడు.

''పో బావా — అమ్మా !'' అంటూ సిగ్గుపడి పోయింది సావిత్రి.

''ఏరోయ్ ప్రెసిడెంటూ —ఇప్పట్నుంచే ఎత్తుకు పోతావా ఏమిటిరా మా అమ్మాయిని'' అన్నారు లింగమూర్తిగారు గదిలోకి అడుగుపెడుతూనే ఆ దృశ్యం చూసి

ఇంతలో ఆయన భార్య కాఫీ తీసుకొచ్చింది

''సరేగాని, కట్నం ఏమాత్రం కావాలి ప్రెసిడెంటుగారికి—అడిగావా !''

''నాకు కట్నం ఎందుకు మామయ్యా !''

''అదేమిటోయ్ — నువ్వు అడగాలి, నేనివ్వాలి అడుగు'' అన్నారాయన నవ్వుతూ.

''అయితే నాకిస్తున్నానని అనుకుని మన రోడ్డుకి ఒక్క అయిదువేలు ఇచ్చి మా ప్రయత్నాన్ని ఆశీర్వదించు'' అన్నాడు బెరుగ్గా వాసు.

''ఆల్ రైట్. మనపద్దున పదివేలు రాయి. సరేగాని రేపు రోడ్డు పడ్డాక కారుకొంటాను. అమ్మాయికి కాల్లో ముల్లు గుచ్చుకుందంటే దాన్ని తీసుకుని మరుక్షణంలో నువ్వు బస్తీలో ఉండాలి తెలుసా ఆ ." అని మనసారా నవ్వుకుంటూ ఇంట్లోకి పోయారాయన.

''ఇక నాకు డ్రైవరుద్యోగమన్నమాట'' అన్నాడు వాసు చిలిపిగా సావిత్రి కండ్లలోకిచూస్తూ.

''మరే పాపం'' అంది బుంగమూతిపెట్టి సావిత్రి. ఆ సంక్రాంతి నవ సంక్రాంతి అయింది ఆ వూరికి.

★

శబ్దగ్రహణంలో విశేష పురోగతి





Model-210 KWK-W
Price Rs. 540/-Plus taxes

మెట్జ్ రేడియో
ప్రింటెడ్ సర్క్యూట్ తో

- గిల్టు అలంకరణములతో అందమైన వెనీర్డ్ పెట్టె
- ఆరు క్రొత్త ట్యూబులతో హై సెన్సిటివిటి సెలక్టివిటి
- అయిదు స్ప్రెడ్ బ్యాండ్స్
- ఫ్యాన్ షైప్ ట్యూనింగ్ ఇండికేటర్ వ్యాపార భోగట్టాలు కోరబడుచున్నవి

హై-ఫై. రిప్రొడక్షనుకు శీతోష్ణస్థితి కనుగుణముగా రూపొందించబడినది.
పశ్చిమ జర్మనీ సహకారముతో ఇండియాలో తయారుచేయబడింది.

Sole Distributors METRO MUSICS
545 — Kalbadevi Road, Bombay - 2, GRAM. METMUSICS.

తూర్పు, పశ్చిమగోదావరి, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలకు డిస్ట్రిబ్యూటర్లు :
హిందుస్తాన్ ఏజన్సీస్, 24/225 ఏ, దానవాయిపేట, రాజమండ్రి
కృష్ణాజిల్లాకు డిస్ట్రిబ్యూటర్లు :
ఆంధ్ర ఎలక్ట్రిక్ హౌస్, పార్కురోడ్, విజయవాడ-1.